కథానిక - నడ్లవల్లె చిదంబరరెడ్డి

# కొల్లబోయిన పల్లె




దిగువసీమలో ఆకాశంలో మేఘాలు, ఉరుములు మెరుపులు వంటివి లేకుండానే ఎక్కడో ఎగువ సీమలోని కొండల్లో పదును వాన కురిస్తే చాలు ఏరు పెన్నేరై పొంగుకువచ్చేది. పనుల్లో తలమునకలైవున్న తీరప్రాంతం రైతులు, వ్యవసాయ కూలీలూ అనుకోకుండా బుసలు కొడూతూ వచ్చే కాలసర్పం వంటి ఏటి ప్రవాహం కోరల్లో కొట్టుకొనిపోయి ఎక్కడో చెరువులకు నీళ్ళు తీసుకువెళ్ళే కాలువల్లో శవాలై తేలేవారు. అందుకే ఆ నదీ శవాల చరిత్రను గురించి పాతతరం వాళ్ళు కథలుగా చెప్పుకొంటారు. దానిని పీనుగుల ఏరుగా కూడా పిలుస్తుంటారు.

అటువంటి ఏరు ఎగువ సీమ నుంచి దిగువ సీమలోనికి ప్రవేశించే చోట ఒక ఊరుంది. పేరు కానుగుల పల్లె. అది కానుగుల పల్లె కాదని, పూర్వం అక్కడ చెరకు ఆడి రసం తీసి బెల్లం తయారు చేసే గానుగలు ఎక్కువగా ఉండడం వల్ల దానిని గానుగల పల్లెగా వ్యవహరించాలని చాన్నాళ్ళు వాదోపవాదాలు జరిగాయి.

అయినా, పూర్వపు గానుగల మాట ఏమోకాని, ఆ పల్లె చుట్టూ తవ్వని అగడ్తలా పరుచుకున్న ఏరు, సున్నని ఇసుక మేటలు ఉండడంతో వందల ఎకరాల్లో కానుగ చెట్లు హిమాలయాల్లోని కోనిఫర్ వృక్షాల్లాగ పెనుగొండ చుట్టూ కోటలాగా ఉండేవి.

శిశిర ఋతువు వస్తేచాలు రెండడుగుల మందంతో ఎండిన కానుగ ఆకు రాలేది. ఆ ఆకును రైతులంతా బండి జల్లల్లో నింపుకుపోయి కపిలతోలే బావుల దగ్గర వెడల్పుగా గుంతలు తీసి, అందులో వేసి పేడ, ఒండుమన్ను కప్పేవారు. నీరు వదిలి బాగా మురగనిచ్చి పైరుకు ఎరువుగా వాడేవారు. పంటలకు వేరు తెగుళ్ళు సోకకుండా కానుగ పిండి, చీడపీడలకు కానుగ నూనె చల్లుతూ రైతులంతా పోటీలు పడి ధాన్యం పండించేవారు. పండిన గింజలు దాచడానికి గోనె సంచులు వగైరాలు లేనికాలం కావడంతో కళ్ళాల్లోని రాతినేలల్లో గుంతలు తీసి పుట్లకొద్దీ ధాన్యాన్ని దాచిపెట్టేవారు. వాటిని ధాన్యం పాత్రలుగా వ్యవహరిస్తూ, వర్షం వస్తే వాటిలోకి నీరు ఇంకకుండా, ఎద్దుల బళ్ళు వాటిపై వెళ్ళకుండా జాగ్రత్తలు తీసుకునేవారు.

పండిన ధాన్యం అమ్మడం పరమఘోర పాపంగా రైతులు భావించడంతో, రెండో పంట పండుతూనే పాత్రల్లో దాచిన ధాన్యాన్ని లేనివారికి పంచడమో, పొలాలకు ఎరువుగా వాడడమో జరిగేది.

పురాణాలలోని నందన వనం ఊహాగానాన్ని- వసంత మాసం వస్తే చాలు- కానుగుల పల్లె నిజం చేసేది. వేసవి కాలపు సూర్యతాపాన్ని ప్రతిఘటిస్తూ చెట్లు పోటీలు పడి చిలుకపచ్చని చిగుళ్ళ గొడుగులు పట్టేవి. ఆ చిగుళ్ళలో తెలుపు, నీలి, ఎరుపు కలగలిపిన రంగుల కానుగ పూగుత్తులు ముత్యాల సరాల్లా వేలాడేవి. ఆ పూగుత్తులతో గాలికి కదిలే చెట్లు పరువాల పొంగుతో నృత్యం చేసే ప్రకృతి భామల్లాగుండేవి. ఝుమ్మని రాగాలు తీస్తూ తేనెటీగలు పువ్వుపువ్వులో దూరి కొమ్మల్లో మకరందాల మేడలు కట్టేవి.

> ఆ పల్లె చుట్టూ తవ్వని అగడ్తలా పరుచుకున్న ఏరు, సున్నని ఇసుక మేటలు ఉండడంతో వందల ఎకరాల్లో కానుగ చెట్లు హిమాలయాల్లోని కోనిఫర్ వృక్షాల్లాగ పెనుగొండ చుట్టూ కోటలాగా ఉండేవి.

చెట్లకింద నుతిమెత్తని ఇసుక - దానిపై దూది పింజలు పేర్చినట్లు రాలిన కానుగపూలు - శ్రామికులను విశ్రమించడానికి ఆహ్వానించే పూల పానుపులాగుండేది. పల్లెవాసులు పిల్లాపాపలతో వచ్చి చెట్లనీడల్లో ఇంత భోంచేసి, ఇసుక చెలమల్లో తియ్యని నీరు తాగి, ఊయలలేసి ఊగి కబుర్లాడుతూ, నిద్రపోతూ పగలంతా హాయిగా కాలక్షేపం చేసేవారు.

ధనపురం అక్కడికి దగ్గరే కావడంతో ఆ నగరంలోని జనం తిరునాళ్ళకులాగా గుర్రాలపైన, సవారీ బళ్ళలోన వచ్చి నోరూరించే చిరుతిళ్ళు తిని, తాగి కొన్నాళ్ళు జల్సాలు చేసేవారు. రానురానూ కోడిపందేలు గెలిచి, జూదాలు ఆడి మద్యం, మాంసాలతో ఖుషీలు చేసుకోవడం మొదలు పెట్టారు.

మనిషి మనుగడకు ఆహారం ముఖ్యం. అటువంటి మహోన్నతమైన ఆహారం ఉత్పత్తి చేసే పల్లెవాసులకు లేని సుఖభోగాలు నగరాలలో పైరవీలు చేసే సోమరులకెట్లు లభిస్తున్నాయన్న ఆలోచన పల్లెవాసుల్లో పుటమరించింది.

శ్రమజీవికి ఆకలి సమస్య కాదు. పని దొరకకపోవడమే అతనికి సమస్య. సోమరి జీవికి పనిచేయడం ఒక సమస్య. ఆకలి మరింత పెద్ద సమస్య. అందుకే నడుం వంచకుండానే, చేతికి మన్ను అంటకుండానే కడుపు నింపుకోవడానికి అనాది నుంచి సోమరిగాడు ఏవో ఎత్తుగడలు వేస్తూనే ఉన్నాడు.

అటువంటి ఎత్తుగడల ఫలితమే వస్తుమార్పిడి స్థానంలో ద్రవ్యమార్పిడి తెచ్చి శ్రమదొంగలంతా వరాన్నభోక్తలై దళారులుగా కడుపునింపుకోవడానికి దారులు వేశారు.

తిండిగింజలు అమ్మడం పాపపు పని కాక, ధర నిర్ణయించి దాచిపెట్టి కరవు సృష్టించి లాభాలకమ్మడం సేవాకార్యక్రమంగా పరిగణింపబడింది. ఇప్పుడు శ్రమజీవి కాయకష్టం ధ్యేయం అన్నం కాదు. అన్నాన్ని సైతం కొనగలిగే ధనంగా మారింది. ధనాకాంక్ష పెరిగిన మరుక్షణం చెట్లు నరికి, గుట్టలుకెదికి సాగుభూమి విస్తీర్ణం పెరిగింది. స్వేచ్ఛగా ముందుకుసాగే వంకలు వాగులను చెరువులు కబంధహస్తాలై అడ్డగించాయి. గలగలపారే ఏటి గొంతును ఆనకట్టలు ఉరితాళ్ళై బిగదీస్తూనే ఏరు నిర్జీవమై ఎండిపోయింది. చుక్క నీరు కూడా దిగువ సీమవాసులకు అందకుండా పోయింది.

ప్రకృతిసిద్ధంగా నీటికీ, చేపకూ ఉన్న అనుబంధం వంటి పల్లెకూ, ఏటి నీటికీ ఉన్న సంబంధం బందయిపోవడంతో కానుగులపల్లె కలవరపోయింది. పచ్చని పొలాల కళ్ళు బీటలువారేలా నీళ్ళ కోసం ఎదురుచూసింది. బావులు తవ్వి కొన్నాళ్ళు, గొట్టం బావులు దించి కొన్నాళ్ళు పంటలను కాపాడుకోగలిగింది. అంతలో - ఇంత శ్రమపడి పంటలు పండించకపోతే ఏమి? మరో మార్గంలో డబ్బు సంపాదిస్తే కడుపులోని చల్ల కదలకుండా తిండిగింజలు కొనవచ్చుగదా అనే విపరీతమైన ఆలోచన!

ఆ ఆలోచనా అగ్ని కీలలకు ఆజ్యం పోస్తూ ధనపురంలో కర్మాగారం నెలకొల్పే ప్రయత్నం.



నగరంలోని రూకలరావు పల్లెకు వచ్చి అందరినీ రచ్చబండకు పిలిపించి, "సూడండప్పా, ఇన్నేండ్ల నుంచి ఎద్దుల జతలో పశువుల మాదిరి రొమ్ములు పగులగొట్టుకోని సేద్యాల్జేస్తావుండారు. ఎంత మాత్రం దుడ్లు మిగిలిచ్చిం డారు? ఆడోళ్ళకి ఏమి సొమ్ములు సేపిచ్చిండారు? ఒంటినిండ బట్లెందరు కడతావుండారు? ఇపుడు కలికాలము నడిమధ్య నడుస్తావుండాది. ఇంగ వానలు కురిసెల్లే. ఎవురి పొట్న వాళ్ళు బదికేది నేర్సుకోవల్ల. ఇపుడు మీకేమీ తక్కువ లేదు. ఏటిగడ్డలో కావలసినన్ని బంగారాకట్ల కానుగు సెట్లుండావి. మీరంతా ఒగుమాట సెప్పండి. మీ ఊరు కరవు తీరే అన్ని దుడ్లిచ్చి అన్నీ కొనుక్కుంటాను" అని వాళ్ళలో వ్యవసాయంపై నిరాశ, అడవి అమ్మకానికి ఆశ రగిలించి తక్కువ ధరకే చెట్లన్నీ కొనేశాడు.

ఇంకా కొందరు రైతులు "యట్లా కలికాలము, కచ్చడా కాలము ఒస్తే మాత్రము బూమ్మీదుండే జనాలు అన్నం తినేదిడిసి ఉత్త దుడ్లు తిని బతకతారా యాడన్నాను" అని బావుల్లో వచ్చే కాస్త కూస్త నీళ్ళతోనే వ్యవసాయం చేస్తూవుంటే,

వారికిగూడ డబ్బులాశ చూపి రూకల్రావు నీళ్ళన్నీ కొనేశాడు.

ఏట్లో ఒండుమన్ను తడిపి మాగబెట్టి ఇటుకలు చేసి, చెట్లు నరికించి వరుసబెట్టి గుట్టల్లాగ ఇటుక బట్టీలు కాల్పించాడు.

బంగారు పంటలు పండిస్తున్న మాగాణి మన్ను కాలి ఇటుకల్లై బండరాళ్ళల్లా అగుపించేసరికి నగరాలలో మేడలూ, కర్మాగారాలూ కట్టేవారంతా నీవా నేనా అంటూ పోటీలుపడి కొనుక్కుపోయేది మొదలుపెట్టారు.

ఇప్పుడది కానుగులపల్లె కాదు, నగరాలకు ఇటుకలు సరఫరా చేసే ఇటుకలపల్లె! అక్కడి ప్రజలు రైతులు కూడా కాదు. అందరూ రూకలకి కన్నతల్లి వంటి భూమిని మట్టికింద జమకట్టి నీళ్ళు వదిలి మన్ను పిసికేవాళ్ళు, ఇటుక అచ్చులు వేసేవాళ్ళు, బట్టీలు పేర్చేవాళ్ళు, కాల్చేవాళ్ళు, లారీలకు మోసేవాళ్ళు, పాత కట్టడాలను ధ్వంసం చేసేవాళ్ళు, కొత్త కట్టడాల పేరుతో రాళ్ళేసేవాళ్ళు, అడ్డుగోడలు కట్టేవాళ్ళు పట్నం పనులకు కూలీలను సరఫరా చేసే దళారీలు.

ఊరి చుట్టూ పల్లెతనాన్ని, ప్రకృతిలాలిత్యాన్ని రక్షించే కోటలాంటి కానుగతోపును, భూమి తల్లి హృదయం తడిని కాపాడే ఒండుమన్ను మేటను అడుగారా అమ్ముకొన్నా కూడా వారి ధనాపేక్ష ఆరలేదు. ఆకలి తీరలేదు.

అప్పుడు కుర్చీరావు కళ్ళు పల్లెమీద పడ్డాయి. "పల్లెలంటే దేశానికి కళ్ళు. దానిని గమనించని బూర్జువా తొత్తులు ఏమాత్రం అక్కరకురాని గార్దభగుర్తు జండా అండతో అధికారానికి వచ్చి పల్లె ప్రజలకు తీరని ద్రోహం చేశారు.

"ప్రజల చేతికే అధికారం పగ్గాలందించాలని, సురాజ్యం స్థాపించాలని, ప్రతి మనిషికి తట్ట నిండా తిండి, చెంబు నిండా నీరు అందించాలనే విశాల దృక్పథంతో తట్ట - చెంబు గుర్తు జండాతో మీ ముందుకు వస్తున్నాను. నాకే మీ ఆమోదముద్ర వేసి అధికారాన్ని అప్పగించం"డని అనర్గళంగా ఉపన్యాసాలు దంచి అధికార పీఠం ఎక్కేశాడు.

కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని తన బంధుబలగానికి ధారాదత్తం చేసి, పెద్ద కర్మాగారానికి అనుమతి మంజూరు చేసి పల్లె ప్రజలందరికీ ఉచితంగా తట్ట, చెంబు సరఫరా చేయించాడు.

తట్ట, చెంబు అందుకొన్న ప్రజలు కుర్చీరావు ఔదార్యానికి ఉబ్బిపోయారు.

ఆనందంతో పొంగిపోయారుగాని, ఆకలిని మాత్రం మరచిపోలేకపోయారు. అందుకే తట్టలో అన్నాన్ని, చెంబులో నీళ్ళను నింపి పుణ్యం కట్టుకొమ్మని కుర్చీరావుకు విన్నపాలు పంపుకున్నారు.

తాను కూడా అదే ప్రయత్నంలో నిమగ్నమై ఆధునిక పద్ధతులతో అన్నం, నీరు సరఫరా చేసే శాస్త్రీయ విధానం పరిశీలనా నిమిత్తం విమానాలలో విశ్రాంతి లేకుండా విదేశాలు పర్యటిస్తూ ప్రజాసేవలో కూరుకుపోయానని, తన కార్యదీక్షను, అంకితభావాన్ని వివరిస్తూ అతని నిలువెత్తు పంచరంగుల చిత్రాలతో పత్రికల నిండా లక్షలాది రూపాయల ప్రకటనలు జారీ చేశాడు.

అయ్యవారు వచ్చేదాకా అమావాస్య ఆగనట్లు అధినాయకులు వండి, వార్చేదాకా ఆకలి ఆగదు కదా! అందునా దరిద్రానికి ఆకలి భయానికి దాహం ఎక్కువన్నట్లు - జనాల్లో ఆశ మితిమీరి ఏదో ఒకటి చేయాలనే ఆరాటం ఎక్కువైంది. తాత చనిపోతే అతని చావుకు సంతాపం తెలుపడం అటుంచి బొంతను వాటాలు పంచుకోవడానికి ఎగబాకినట్లు, ఎండిన ఏటిలోని ఇసుకను నగరాలకు తోలి కొందరు, బోరింగుల్లో వచ్చే కొద్దిపాటి నీటిని బిందెల లెక్కన తాగడానికి అమ్ముకొంటూ కొందరు తమ ధనదాహం తీర్చుకోసాగారు.

చిత్రాలు: నర్సిం



అప్పుడు తుపాకీరావు రంగంలోకి దూకి, "వేలి ముద్రలు దేశానికి తీరని కళంకం. ఆ వేలిముద్రలు పెరిగి అక్షరాస్యత తరగడం వల్లనే ప్రజలు తమ జీవన ఔన్నత్యాన్ని తెలుసుకోలేక సమాజ సహజ వనరులను దుర్వినియోగం చేస్తున్నారు. అది చాలదన్నట్లు 'సందట్లో సడేమియా' అని బొటన వేలి గుర్తుగాళ్ళను కలంయోధులు అన్నిరకాలుగా దోపిడీ చేసి అందలా లెక్కేస్తున్నారు. అటు చదివించడమో, ఇటు తుపాకీకి బలిచేయడమో ఏదో ఒకటి చేస్తే కాని ఈ సమాజం త్వరగా బాగుపడి చావదు" అంటూ బాంబులు పేల్చాడు.

ఇలాగైతే తన పప్పులుడకవని తెలుసుకున్న కుర్చీరావు బావమరిది అవకాశరావు ప్రజలం దరినీ అక్షరాస్యులను చేసే "ముంగిట్లో చదువు" అనే బృహత్తర కార్యక్రమానికి ప్రభువుల వారితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. పగలంతా పఠనాలయంలో భుక్తాయాసంతో నిద్రపోయినా, రాత్రివేళ నిద్రాహారాలు మాని "సంతకం చేయడం నేర్చుకోండి. ముంతడు సారా ఉచితంగా పొందండి" అనే వినూత్న నినాదంతో ప్రజలకు చేరువై పురోగతి సాధించాడు. చూస్తుండగానే అందరూ స్వదస్తూరీతో సంతకం చేయడం నేర్చుకొని అవకాశరావు సంబంధీకులు అమ్మే విద్యాప్రమాణ పత్రాలను కొనిపారేశారు.


బాంబులా పేలిన తపాకీరావు, అవకాశరావును జైకొట్టే జనాలను చూసి తుస్సుమని తెల్లమొగం వేశాడు. రకరకాల పథకాల పేర్లు, పల్లెల పేర్లూ, ప్రజల సేవకై వచ్చే వారి జాతకాలూ మారడమే కాని, గొర్రెతోక బెత్తెడన్నట్లు పల్లె ప్రజల జీవితాలేమీ మారలేదు.

"అధికారం ఈసారి కూడా నాకే కట్టబెట్టండి. మీ సేవ కోసం పునరంకితమై పోతా"నంటూ కుర్చీరావు చేతులు జోడించి ప్రజల ముందుకొచ్చాడు.

'తట్ట, చెంబులిచ్చి మమ్మందర్నీ బిక్షగాళ్ళలా తయారుచేశావు. జీవితాంతం మోసపోవడానికి మేము గొర్రెలమేమీ కా'మంటూ ప్రజలు ఎదురు ప్రశ్న వేశారు.

అందుకు కుర్చీరావు, "ఈ సామ్రాజ్యాధిపతిగా ఉన్నంతవరకు ప్రజలకు ఖాళీ తట్ట, చెంబుకు మించి సమకూర్చే అధికారం నాకు రాజ్యాంగం రీత్యా సంక్రమించదు. నిజంగా తట్టనిండా అన్నం, చెంబు నిండా నీళ్ళు మీకు సమకూర్చాలంటే నేను నియంత రాజ్యాధికారం కోసం పోటీ చేసి గెలుపొందవలసి ఉంది. తప్పకుండా నన్ను ఆ పదవికి గెలిపించి మీకు అన్నము, నీరు అందించే భాగ్యం కలిగించి నా జీవితాన్ని తరింపచేయండి" అంటూ కాళ్ళమీద పడ్డాడు.

ఒక్కోసారి ఒక్కోరకమైన మాయమాటలు చెప్పి ఏదో ఒకరకంగా కుర్చీ ఎక్కేస్తున్న కుర్చీరావు మాటలను ప్రజలు ఈసారి నమ్మదలచుకోలేదు. ఏమాత్రం ఆవేశానికి లోనుకాకుండా కుర్చీరావు చెప్పే ప్రతి మాటా ఓపికగా విన్నారు.



ఎన్నిక రోజు మాత్రం గడప దాటి బయటికి వచ్చి ఒక్కరు కూడా అతనికి తమ ఆమోదముద్ర వేయలేదు. ఆ రకంగా తమ నిరసనను తెలిపి ఒక్కరి అభిమతాన్ని కూడా అతనిపరం కాకుండా చేసి అవమానపరచాలని నిర్ణయం చేసుకున్నారు.

'దేవునికీ, మనిషికీ అనాదీ నుంచి వైరము' అనే ఆర్యోక్తి ఏమోకాని, దేవునికి వ్యతిరేకమే మానవ జన్మ! అందుకే తానొకటి తలిస్తే దైవమొకటి చేసి తీరుతుంది. అందునా దైవాంశముంటేనే రాజ్యాధికారం వస్తుందని పెద్ద బుక్కులన్నీ ఘోషిస్తున్నాయి. దానికి దృష్టాంతంగానే కుర్చీరావు ప్రజలనుకున్నట్లు ఏ ఒక్కరి అభిమతానికీ నోచుకోక సభ్య దేశాలలో అవమానం పాలు కాలేదుగాని, తొంభై శాతం పైగా ప్రజాభిమానం పొంది నియంత రాజ్యాధికారం చేజిక్కించుకున్నాడు. అది భూప్రపంచంలోనే అరుదైన విజయంగా అతని కీర్తి దేశదేశాల్లో మారుమోగిపోయింది. ఆశ్చర్యంతో నోళ్ళు వెళ్ళబెట్టుకున్న ప్రజలు 'రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా' అన్న ఆర్యోక్తి గుర్తుకు వస్తేగాని తమ నోళ్ళు మూసుకోలేక పోయారు.

ఊరి చుట్టూ పల్లె తనాన్ని, ప్రకృతి లాలిత్యాన్ని, భూమి తల్లి హృదయం తడిసి కాపాడే బండమన్ను మేటను అమ్ముకొన్నా వారి ధనాపేక్ష ఆరలేదు.

పల్లెల్లో ఎవర్ని నమ్ముకొని ఉండాలో, దేన్ని అమ్ముకొని కడుపు నింపుకోవాలో ప్రజలకు అర్థం కాలేదు. కన్నతల్లివంటి సొంత ఊరూ, కడుపుకు తిండి పండించాల్సిన వ్యవసాయమూ మాట దేవుడెరుగు, బతికుంటే బస్టాండులో రంగునీళ్ళమ్ముకొని బతకవచ్చనుకొని నీటి వనరులున్న ప్రాంతాలకు, పొరుగు దేశాలకు వలసలు పోయారు.

ఇప్పుడది ఇటుకల పల్లె కాదు.

ఎందుకంటే, ధనపురం ధనదాహంతో రోజురోజుకూ విస్తరిస్తూ ఎన్నో పల్లెలను, వాటిలోని మనుషులను తనలో కలుపుకొని కిటకిటలాడి పోతోందిగాని, వారు తలదాచుకోవడానికి మాత్రం చోటు చాలడం లేదు. ఇటుకలు అచ్చుపోయడానికి మన్ను, నీరు కాని, కొందామంటే రాళ్ళు కలపాకానీ లభించని దుఃస్థితి దాపురించింది.

చీకటిపడితే చాలు ధనపురం వాసులంతా దొంగల్లా పల్లెలో దూరిపోతారు.

తమకు అవసరమైన ఇటుకలో, తలుపులో, దూలాలో, పునాదిరాళ్ళో - ఏదో ఒకటి ఎటువంటి బిడియమూ లేకుండా నిండుగా బతికిన పల్లెను కొల్లగొట్టి నిర్భయంగా దోచుకుపోతున్నారు.

అందుకే ఇప్పుడది కొల్లబోయిన పల్లెగా మిగిలిపోయింది. ■